క్లుప్తంగా

ధాన్యం కొనుగోలుకు రూ.10.25 కోట్లు విడుదల

రాజవొమ్మంగి: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా(ఆర్బీకేల ద్వారా) రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి మూడవ విడతగా రూ. 10.25 కోట్లు విడుదలైనట్టు సివిల్ సప్లయ్స్ డీఎం గణేశ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఈ ఖరీఫ్‌లో జిల్లా వ్యాప్తంగా 4,631 మంది రైతుల నుంచి 22,183 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్టు ఆయన చెప్పారు. అందుకు గాను దీని విలువ రూ. 48.42 కోట్లు కాగా ఇప్పటికే 3,978 మంది రైతుల బ్యాంకు ఖాతాలకు రూ.35.76 కోట్లు జమ చేసినట్టు తెలిపారు. మిగిలిన సొమ్ము కూడా త్వరలోనే విడుదలవుతుందన్నారు.

అయోధ్యకు తరలివెళ్లిన భక్తులు



అయోధ్యకు తరలివెళ్తున్న విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు

గంగవరం : అయోధ్యలోని బాలరాముని దర్శనానికి రంపచోడవరం నియోజకవర్గం నుంచి విశ్వహిందూ పరిషత్ , ఆర్‌ఎస్‌ఎస్ సంస్థల ఆధ్వర్యంలో సుమారు 100 మంది కార్యకర్తలు సోమవారం తరలివెళ్లారు. రాజమండ్రి నుంచి ప్రత్యేక రైలులో అయోధ్యకు వెళ్లారు. అయోధ్యకు పయనమైన వారిలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ప్రతినిధులు కుమార్‌రావు, కార్యదర్శి నాగేశ్వరరావు, ప్రసాద్ సన్యాసిరావు తదితరులున్నారు.

క్రీస్తు బోధనలు ఆచరణీయం



పాస్టర్లకు దుస్తులు అందజేస్తున్న హెచ్‌జేసీఎం డైరెక్టర్ మాణిక్యం

అరకులోయ రూరల్: మండలంలోని లోతేరు పంచాయతీ పరిధిలో గల తాంగుల బెడ్డ గ్రామంలో సోమవారం హెచ్‌జేసీఎం వ్యవస్థాపకుడు, డైరెక్టర్ మాణిక్యం ఆధ్వర్యంలో సువార్త కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏసు క్రీస్తు బోధనలు మానవాళికి ఆచరణీయమన్నారు. ప్రతి ఒక్కరూ చెడు మార్గాన్ని వీడి, మంచి మార్గం వైపు పయనించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పాస్టర్‌లకు దుస్తులు పంపిణీ చేశారు. జ్ఞానమ్మ, జాన్‌పీటర్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన



వారపు సంతలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై వీధి నాటికను ప్రదర్శిస్తున్న కళా బృందం

పెదబయలు: ప్రభుత్వం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆదేశాల మేరకు పెదబయలు వారపు సంతలో సోమవారం హెచ్‌ఐవీ,ఎయిడ్స్‌పై కళా బృందంతో అవగాహన కల్పించారు.హెచ్‌ఐవీని అరికట్టాలని నాగసాయి కళాబృందం ఆధ్వర్యంలో వీధి నాటిక రూపంలో అవగాహన కల్పించా రు. స్త్రీ, పురుషులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు.తొందర పాటు పనుల వల్ల నష్టపోయే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. గ్రామ సచివాలయం సిబ్బంది, గ్రామ వలంటీర్లు, కౌన్సిలర్, ల్యాబ్ టెక్నీషియన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ టాలెంట్ టెస్ట్



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

అరకులోయ రూరల్: మండల కేంద్రం అరకులోయలో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో వివిధ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సోమ వారం మోడల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు.ఎస్‌ఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు ఐసుబాబు, ఉపాధ్యక్షురాలు కొండమ్మలు మాట్లాడుతూ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షల్లో భయం పొగట్టేందుకు ఈ పరీక్షలు ఎంతగానో దోహదపడతాయన్నరు. ప్రతి విద్యార్థి పరీక్షలు ధైర్యంగా రాసి, మంచి మార్కులు సాధించాలన్నారు. హరి, బలరాం, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే జగనన్న ధ్యేయం

- రంపచోడవరం ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు
- చింతూరులో ఆసరా చెక్కుల పంపిణీ



డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి, డ్వాక్రా మహిళలు

చింతూరు: పేదల ముంగిటకే పాలనను తీసుకొచ్చిన జగనన్న ప్రభుత్వాన్ని మరోమారు ఆదరించాలని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయ్‌భాస్కర్ కోరారు. సోమవారం చింతూరులో నిర్వహించిన డ్వాక్రా మహిళలకు నాలుగో విడత ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు రుణమాఫీ అంటూ అబద్ధపు హామీతో డ్వాక్రా అక్క, చెల్లెమ్మలను మోసం చేశాడన్నారు. దీంతో 2019లో రాష్ట్రంలోని మహిళలంతా చంద్రబాబుకు గట్టిగా బుద్ధి చెప్పారని, మరోమారు వైఎస్సార్‌సీపీ పథకాలను కాపీకొడుతూ అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్నాడని వారు విమర్శించారు. ప్రజా సంకల్ప పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే నాలుగు విడతలుగా డ్వాక్రా సంఘాలకు రుణ మాఫీ చేశారని స్పష్టం చేశారు. అధికారం కోసం 600 హామీలు ఇచ్చిన టీడీపీ ఒక్క హామీని కూడా నెరవేర్చలేదన్నారు. నవరత్నాలను అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన వైఎస్సార్ సీపీ ప్రజలకు అంతకంటే అధికంగా పథకాలు అందించిందన్నారు. మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు.గ్రామ సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రానున్న కాలంలో మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. చింతూరు మండలంలో నాలుగో విడతలో 4,632 మంది డ్వాక్రా మహిళలకు రూ 1.72 కోట్లు రుణమాఫీ జరిగిందని, మొత్తంగా నాలుగు విడతల్లో రూ 6.87 కోట్లు మాఫీ చేసినట్టు వారు తెలిపారు. చింతూరు మండలంలో గడచిన నాలుగున్నరేళ్ల కాలంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాల నిమిత్తం రూ.170 కోట్లు, అభివృద్ధి పనుల నిమిత్తం రూ.113 కోట్లు ఖర్చు చేసినట్టు వారు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి డ్వాక్రా మహిళలతో కలిసి ఎమ్మెల్యే ధనలక్ష్మి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సవలం అమల, వైస్ ఎంపీపీలు మేడేపల్లి సుధాకర్, యడమ అర్జున్, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ అక్బర్‌అలీ, పార్టీ మండల కన్వీనర్ యగుమంటి రామలింగారెడ్డి, కోట్ల కృష్ణ, ఏపీడీ శ్రీనివాసరావు, తహసీల్దార్ నజీముల్లాషా, ఎంపీడీవో రవిబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నేతలు

కొయ్యూరు: మంప సచివాలయ కన్వీనర్ నత్తూరి సరస్వతి కుటుంబాన్ని ఆదుకుంటామని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి అన్నారు. సరస్వతి అనారోగ్యంతో కొద్దిరోజులు కిందట మరణించారు. ఎమ్మెల్యే సోమవారం కించవానిపాలెంలో పర్యటించి, బాధిత కుటుంబాన్ని కలిసి పరామర్శించారు. కుటుంబ వివరాలను తెలుసుకున్నారు. ఆ కుటుంబానికి ఎంపీపీ బడుగు రమేష్, ఎమ్మెల్యే కలిసి సంయుక్తంగా ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక భరోసా కల్పిస్తామని, అన్ని విధాలుగా ఆదుకుంటామని వారు భరోసా కల్పించారు. జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, మండల పార్టీ అధ్యక్షుడు జల్లి బాబులు, సచివాలయ కన్వీనర్ సుధాకర్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, జిల్లా కార్యదర్శి సత్యనారాయణ నేతలు పాల్గొన్నారు.

పార్టీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు



గుజ్జెల మధుసూదన్‌ను సన్మానిస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

అనంతగిరి: పార్టీలోని కష్టపడేవారికి తగిన గుర్తింపు లభిస్తోందని, అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ గుజ్జెల మధుసూదన్, ఇటీవల పశుసంవర్ధకశాఖలో జిల్లా సభ్యుడిగా నియమితులవ్వగా.. కురడబోయిన గంగరాజు రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శిగా నియమితులైయ్యారు. మండలంలోని పినకోట పర్యటించిన అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ తదితరులు మధుసూదన్, గంగరాజులను దుశ్శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ పార్టీ కోసం ఆహర్నిశలు శ్రమించే వారికి అవకాశాలు వెదుక్కొని వస్తాయని, సామాన్యులను ఉన్నతపదవుల్లో స్థానం కల్పించిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనే అని కొనియాడారు. వైస్ ఎంపీపీ శకుంతల, మండల పార్టీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, మండల ప్రధాన కార్యదర్శి శెట్టి లక్ష్మణరావు, ఎంపీటీసీలు మితుల, శ్రావణి, రామలక్ష్మి, సర్పంచ్‌లు అన్నపూర్ణ, పెంటమ్మ, కో–ఆర్డినేటర్ గంగులు, అరకు జేసీఎస్ కన్వీనర్ సంపత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

పెదబయలు: మండలంలోని తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ప్రభుత్వ స్థలంలో ఇటీవల షాపులు ఏర్పాటు చేశారని వెంటనే తొలగించాలని మండల డిప్యూటీ తహసీల్దార్ జి.రంగారావు అన్నారు. ఈ విషయంపై ఆయన మాట్లాడుతూ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రెండు రోజుల్లో ఆ స్థలంలో ఉన్న దుకాణాలు తొలగించాలన్నారు. వీఆర్వో ఆజాద్, వీఆర్‌ఏలు సుందర్‌దేవ్, నాగన్న తదితరులున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు జగనన్నతోనే సాధ్యం



గ్రామస్తులకు పథకాలపై అవగాహన కల్పిస్తున్న మత్స్యలింగం

అరకులోయ రూరల్: అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందని అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం తెలిపారు. మండలంలో పెదలబుడు పంచాయతీ గరడగుడ, పెదలబుడు గ్రామాల్లో పార్టీ శ్రేణులతో సోమవారం పర్యటించా రు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందజేయడం ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతుందన్నా రు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.. రాష్ట్రంలో జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు అందరూ వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలియజేయాలని కోరారు. మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మణ్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు శత్రుగున్, రాంచందర్, నాయకులు నర్సింగ్, రామ్మూర్తి, నొబో, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: మండలంలోని దుర్గం పంచాయతీ పాటిగరువు గ్రామంలో అరకు అసెంబ్లీ సమన్వయకర్త రేగం మత్స్యలింగం సోమవారం పర్యటించారు. గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు వెచ్చిస్తోందని, గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. శంకరరావు, అప్పలస్వామి, జన్నిచంటి, కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

జి.మాడుగుల: మండలంలోని సొలభం పంచాయతీ కేంద్రంలో నీలకంఠేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సోమవారం పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ ధర్మకర్త సాయిరాం స్వామిజీ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తులు, భక్తుల ఆధ్వర్యంలో శివాలయం నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దాతలు ఆలయ కమిటీకి సహాయ సహకారా లు అందించవచ్చన్నారు. సమరసతా సేవా ఫౌండేషన్ జిల్లా పరియోజన కార్యదర్శి మత్స్యరాజు తదితరలు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



చిన్నతమ్మెంగులలో వైద్య సేవలందిస్తున్న డాక్టర్ శిరీష, వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని కిలగాడ వైద్యాధికారి శిరీష అన్నారు. మండలంలో గల జర్జుల పంచాయతీ చిన్నతమ్మెంగుల గ్రామంలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ వ్యాధులతో బాధపడుతున్న 90 మందికి వైద్య సేవలందించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించా రు. ఈ సందర్భంగా వైద్యాధికారి శిరీష మాట్లాడు తూ పరిశుభ్రతతోనే రోగలను నివారించవచ్చునని, వ్యాధులు వస్తే వెంటనే వైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. తద్వారా వైద్య శిబిరాలు నిర్వహించి, వ్యాధులు అదుపు చేసేందుకు వీలు ఉంటుందన్నారు. హెల్త్ అసిస్టెంట్ నాగరాజు, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, ఏఎన్‌ఎం గౌరి, 104 డిఈవో కృష్ణవేణి, పైలెట్ గణపతిరాజులు పాల్గొన్నారు.

ఘనంగా శివాజీ జయంతి



దుస్తులు అందజేస్తున్న స్వచ్ఛంద సంస్థ సభ్యులు

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని విశ్వ హిందూ ధార్మిక పరిషత్ జిల్లా కన్వీనర్ రమణ, వర్తక సంఘం అధ్యక్షుడు బెతాళుడు ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చేయూత వారియర్స్ ట్రస్ట్ సమక్షంలో సాయినగర్ వీధిలో నిరుపేద చిన్నారులకు దుస్తులను పంపిణీ చేశారు. శివాజీ చేసిన పోరాట ప్రతిమను, వీరత్వాన్ని, హిందు ధర్మ రక్షణకై పాటుపడిన గతాన్ని గుర్తుచేశారు. సత్యనారాయణ, రాంబాబు, శ్రీను, జగన్, మూర్తి పాల్గొన్నారు.

మలేరియా నిర్మూలనకు చర్యలు



భీమవారంలో సిబ్బందితో మాట్లాడుతున్న జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ

అనంతగిరి: మలేరియా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని జోనల్ మలేరియా అధికారి శాంతిప్రభ అన్నారు. మండలంలోని భీమవారం పీహెచ్‌సీని ఆమె సోమవారం సందర్శించారు. ముందుగా మలేరియా కేసులపై ఆరా తీసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా శాంతిప్రభ మాట్లాడుతూ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించి, మలేరియా నిర్మూలనకు వైద్య సిబ్బంది కృషి చేయాలన్నారు. భీంపోల్ గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలను సందర్శించి, పలు సూచనలు చేశారు. అక్కడ నుంచి ఎగువలువ్వా, దాసరితోట గ్రామాల్లో పర్యటించి, గిరిజనులతో మాట్లాడారు. అత్యధికంగా మలేరియా కేసులు నమోదువుతున్న గ్రామాలపై వైద్య సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. మలేరియా కేసులను అదుపులోకి తీసుకురావాలన్నారు. వైద్యాధికారి అనూప్, ఎంపీహెచ్‌ఈవో నందయ్య, హెచ్‌ఎస్ దాలన్నదొర, హెచ్‌వీ లక్ష్మీ, ఎల్‌టీ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పీవోకు గ్రామస్తుల వినతి



ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేకు వినతిపత్రాన్ని అందజేస్తున్న గ్రామస్తులు

మారేడుమిల్లి: తమ రెండు గ్రామాలకు రహదారి నిర్మించాలని కోరుతూ మండలంలోని కుండాడ పంచాయతీ పరిధిలోని తూర్రుమామిడి, కదుమూరు గ్రామ గిరిజనులు సోమవారం రంపచోడవరంలో ఐటీడీఏలో జరిగిన స్పందన కార్యక్రమంలో పీవో సూరజ్ గనోరేకు వినతిపత్రాన్ని అందజేశారు. సరైన రహదారి లేక మండల కేంద్రానికి వచ్చేందుకు నానా అవస్థలు పడుతున్నామనిపేర్కొన్నారు. అధికారులు స్పందించి తమ గ్రామాలకు రహదారి నిర్మించాలని వినతిలో కోరారు. గ్రామస్తులు దొర, అబ్బాయి రెడ్డి, రాజారెడ్డి, రాజన్న దొర తదితరులున్నారు.

వైఎస్సార్‌సీపీ రోడ్ షో రేపు



సమావేశంలో పాల్గొన్న నాయకులు

మారేడుమిల్లి : రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంతబాబుల ఆధ్వర్యంలో బుధవారం వైఎస్సార్ వాహన మిత్ర రోడ్ షో కార్యక్రమం జరుగుతుందని అడ్డతీగల సొసైటీ అధ్యక్షుడు తోట రాజేశ్వరరావు చెప్పారు. సున్నంపాడు, జీఎం వలస, కుండాడ పంచాయతీల ముఖ్య నాయకులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. రోడ్‌షో కార్యక్రమానికి పార్టీ శ్రేణులంతా తరలివచ్చేలా చూడాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామాల్లో పశువైద్య శిబిరాలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి రాజశ్రీ

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల్లో పశువైద్య శిబిరాలు నిర్వహించి, పశువులకు టీకాలు వేయాలని పశుసంవర్ధకశాఖ వైద్యాధికారి రాజశ్రీ చెప్పారు. ఆమె సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని పశువులకు వేసవిలో ఎటువంటి వ్యాధులు రాకుండా ఉండేందుకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు.కిసాన్ క్రెడిట్ కార్డులపై అవగాహన కల్పించాలన్నారు. దివ్య, సుబ్బారావు, త్రినాథరావు, సంజీవరావు, అనంతరావు , రత్నం, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

60 మందికి కంటి వైద్య పరీక్షలు



మాట్లాడుతున్న రెడ్‌క్రాస్ జిల్లా కో-ఆర్డినేటర్ లోహితాస్

ముంచంగిపుట్టు: మండలంలోని లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో సోమవారం ఇండియన్ రెడ్‌క్రాస్, విశాఖ ఐ హాస్పిటల్ ఆధ్వర్యంలో నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర సమస్యలతో బాధపడుతున్న 60 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వీరిలో 14 మందిని శస్త్ర చికిత్సల నిమిత్తం విశాఖకు అంబులెన్స్‌లో తరలించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ జిల్లా కో–ఆర్డినేటర్ వి.లోహితాస్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు మారుమూల గిరిజన గ్రామాల్లో రెడ్‌క్రాస్ ద్వారా సేవ కార్యక్రమాలు, వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. నేత్ర వైద్య శిబిరంలో గుర్తించి, వారికి శస్త్ర చికిత్సల నిమిత్తం విశాఖకు పంపిస్తున్నామని, వారికి చికిత్స అనంతరం ఇంటికి తమ వాహనంలోనే పంపిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ త్రినాథ్, వైద్యాధికారులు సాయికుమార్, శ్యామ్, ఏఎన్‌ఎం జానకమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఏకలవ్యలో పది పరీక్షలు

రాజవొమ్మంగి: చింతూరు, మారేడుమిల్లి, వై.రామవరం, రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాలల్లో మంగళవారం నుంచి పదో తరగతి పరీక్షలు జరుగనున్నట్లు కన్వీనర్ ప్రిన్స్‌పాల్ (ఈఎంఆర్‌ఎస్, వై. రామవరం) రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంభందించి అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు పేర్కొన్నారు. నాలుగు పాఠశాలల నుంచి మొత్తం 250 మంది విద్యార్థులు సీబీఎస్సీ సిలబస్ ప్రకారం ఇంగ్లిస మీడియంలో ఈ పరీక్షలు రాస్తారని తెలిపారు. చింతూరు ఏకలవ్య పాఠశాలలో 58 మంది, మారేడుమిల్లిలో–56 మంది, వై. రామవరంలో–77 మంది, రాజవొమ్మంగి ఏకలవ్య పాఠశాలలో–59 మంది పది పరీక్షలు రాయనున్నట్టు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. రాజమహేంద్రవరం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారన్నారు. 20న–తెలుగు , 26న–ఇంగ్లిష్, మార్చి 2న– సైన్స్, 7న–సోషల్, 11న–మాథమెటిక్స్, 13న– ఇన్ఫర్మేషన్ టెక్నాలజీపై పరీక్షలు జరుగుతాయన్నారు.పరీక్ష ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు.

సెల్ టవర్ పనులు వేగవంతం చేయాలి

అరకులోయ రూరల్: బొండం పంచాయతీ కొత్తవలసలో బీఎస్‌ఎన్‌ఎల్ సెల్ టవర్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని గిరిజన సంఘం నాయకుడు బుజ్జిబాబు చెప్పారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల టవర్ నిర్మాణ పనులు నిలిచిపోయాయన్నారు. దీంతో సెల్ సేవలు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



గడ్డంపుట్టులో ఆంజనేయస్వామి ఆలయం వద్ద భక్తులు

సాక్షి, పాడేరు: మండలంలోని తుంపాడ పంచాయతీ గడ్డంపుట్టు గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయం మొదటి వార్షికోత్సవాన్ని సోమవారం గిరిజనులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఉదయం నుంచే ఆంజనేయస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి ప్రసాదాన్ని స్వీకరించినట్టు నిర్వాహకులు తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రమేష్, పక్కన జెడ్పీటీసీ, ఎంపీడీవో

కొయ్యూరు: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ బడుగు రమేష్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం జరిగింది. కార్యక్రమంలో ముందుగా మండలాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసిన కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. రోడ్ల నుంచి తాగునీటి వరకు వినతులు ఇచ్చిన ప్రతీ సమస్యపై సుమిత్‌కుమార్ స్పందించారని ఎంపీపీ బడుగు రమేష్ వెల్లడించారు. తాజాగా ఆయన అనుమతుల ఇవ్వడంలో యూ.చీడిపాలెం పంచాయతీలో పది గ్రామాలకు రోడ్లు వేసేందుకు అటవీ శాఖ అడ్డంకులు తొలగిపోయాయన్నారు. వేసవిలో తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు పాడైన గుడ్లు అందజేస్తున్నారని జెడ్పీటీసీ సభ్యుడు నూకరాజు, ఎంపీటీసీ సభ్యుడు అప్పారావు తదితరులు చెప్పారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసేందుకు ఎంపీడీవో చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి పనుల మస్టర్లలో అవకతవకలు జరుగుతున్నట్టు పలువురు సభ్యులు చెప్పారు. మండల సమావేశానికి తరచూ అధికారులు గైర్హాజరవుతున్నారని చిట్టింపాడు సర్పంచ్ నూకాలమ్మ అసహనం వ్యక్తం చేశారు. అడవుల నుంచి కలప అక్రమ తరలిస్తున్నారని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సభ్యులు కోరారు. ఎంపీడీవో లాలం సీతయ్య, ఏవో బాలమురళీకృష్ణ, డీటీ సీతారామ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మండల మిగులు బడ్జెట్‌పై సభ్యుల ఆమోదం



బడ్జెట్ వివరాలను చదివి వినిపిస్తున్న సూపరింటెండెంట్ సాయిలత

రాజవొమ్మంగి: రాజవొమ్మంగి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం 2024–25 ఆర్థిక సంవత్సరానికి చెంది అంచనా బడ్జెట్ సమావేశం జరిగింది. ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షత వహించారు. బడ్జెట్ వివరాలను సూపరింటెండెంట్ సాయిలత చదివి వినిపించారు. రూ. 61,000 మిగులు బడ్జెట్‌ను పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. నూతన అకౌంటింగ్ పద్ధతిలో అమలు పరచే పథకాల ఆదాయం/ వ్యయం వంటి వాటిని గత ఏడాది నుంచి పరిగణనలోకి తీసుకొని సవరణ బడ్జెట్ రూపొందించారు. 11 మంది ఎంపీటీసీలు, పలు శాఖలకు చెందిన అధికారులు, వైస్ ఎంపీపీ రాజేశ్వరి, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, తహసీల్దార్ సత్యనారాయణ ఉన్నారు.